సాక్షి అనకాపల్లి

శనివారం । 23 । డిసెంబర్ । 2023



అమ్మవారి సారె ఊరేగింపు

యలమంచిలి పట్టణం ధర్మవరంలో కన కమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 8లో



చట్టాలపై అవగాహన తప్పనిసరి

విద్యార్థి దశలో వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ అన్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎం.జి.జి.ఎస్.కుమారి శుక్ర వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 28 నుంచి 28.5, కనిష్టం 18.9 నుం చి 19.3 మధ్య నమోదవుతాయని, గాలిలో తేమశాతం 61 నుంచి 81, గాలి గంటకు 4 నుంచి 5 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

బొజ్జన్నకొండకు బౌద్ధభిక్షువులు



బొజ్జన్నకొండను సందర్శించిన బౌద్ధభిక్షువులు

అనకాపల్లి: మండలంలోని శంకరం పం చాయతీ బొజ్జన్నకొండకు బెంగళూరుకు చెం దిన 40మంది బౌద్ధభిక్షువులు శుక్రవారం వచ్చారు. బుద్ధుని స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనం తరం కొండ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశాఖ బౌద్ధసంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ మాటూరి శ్రీనివాస్, సభ్యులు బల్లా నాగభూషణం, బోర వేణుగో పాల్‌గౌతమ్, పెయ్యల సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు శిక్షణ

తుమ్మపాల: గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగ తులు ప్రారంభంకానున్నట్లు సంచాలకులు/ జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ సాధికా రత అధికారి కె.రాజేశ్వరి తెలిపారు. డిగ్రీలో మార్కుల ఆధారంగా మెరిట్‌ను నిర్ణయించి, గ్రూప్-2 శిక్షణకు 40 మందిని ఎంపిక చేస్తా మన్నారు. గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసిందని చెప్పారు. గ్రూప్ -1 అభ్య ర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ వరకు గడువు ఉందన్నారు. గ్రూప్ - 1 శిక్షణకు 60 మందిని ఎంపిక చేస్తామన్నారు. అభ్య ర్థులు తమ దరఖాస్తులను సర్దార్ గౌతు లచ్చన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్, విశాఖపట్నం ,ఎంవీపీ కాలనీలో అందజేయాలన్నారు. మరింతసమాచారం కోసం 0891- 2564346, 9492569177 అనే ఫోన్‌నంబర్లలో సంప్రదిం చాలని కోరారు.

'మహిళలు స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలి'

- ఆర్‌బీఐ ఏజీఎం హనుమ కుమారి



పవర్‌లూం మిషన్‌ను పరిశీలిస్తున్న హనుమకుమారి, తదితరులు

చీడికాడ: మహిళలు స్వశక్తితో ఎదిగి, మరింత మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆర్‌బీఐ ఏజీఎం హనుమ కుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం చీడికాడ శివారు స్వాతి మ్యాక్స్ ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన పవర్‌లూం టెక్స్‌టైల్స్ యూనిట్‌ను ఆమె పరిశీ లించారు. యూనిట్లో తయారైన దుస్తులను పరిశీలించి మహిళలను అభినందించారు. ఈ సందర్భంగా పవర్‌లూం సీఈవో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఆరు యూనిట్లతో పాటు, మరో ఆరు యూనిట్లు మంజూరు చెయ్యాలని కోరారు. దీనికి స్పందిం చిన ఆర్‌బీఐ ఏజీఎం తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీనికి యూనియన్ బ్యాంకు అధికారులు ఆమోదం తెలిపారు. ఆమె వెంట అనకాపల్లి యూనియన్ బ్యాంకు ఎల్‌డీఎం సత్యనారాయణ, అం కుపాలెం బ్రాంచ్ మేనేజర్ కె.శ్రీనివాస్, పవర్ లూం యాజమాన్యం, సభ్యులు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో సమస్యలుంటే పరిష్కరిస్తాం



కొత్త వీధిలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

చీడికాడ: భూ రీ సర్వే అనంతరం సమస్యలే మైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. శుక్రవారం మండలంలోని కోనాం పంచాయతీ గుంటి శివారు కొత్తవీధిలో సర్వే నంబర్ 289లో గల భూ సమస్యపై గిరిజన రైతుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆమె కొత్తవీధి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఈ సమస్య విష యంలో ఇప్పటికే పలు పట్టాదారు పాసుపుస్త కాలను రద్దు చేసినట్లు చెప్పారు. జనవరి చివరి వారంలో రీ సర్వే జరుగుతుందని, అది పూర్తి అయిన అనంతరం ఇంకా సమస్యలు గుర్తిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం, తహసీల్దార్ బి.వి.రాణి ఉన్నారు.

గిరి బతుకుల్లో కొత్త పొద్దుపోడుపు



ఈ చిత్రంలో ఉన్న గిరి రైతు పేరు ఇళ్లబోయిన దేముడు. ఈయనది కొండవీధి గ్రామం. ముత్తాతల నుంచి కొండపోడు వ్యవసాయాన్నే నమ్ముకుని జీవి స్తున్న కుటుంబం ఇతనిది. అటవీ అధికారులు పలుమార్లు పోడు వ్యవసాయం చేయవద్దం టూ హెచ్చరించారు. ఒకసారి కేసు కూడా పెట్టారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉంది. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కోసం గతంలో ఎన్నో సార్లు అధికారులకు వినతిపత్రాలు అందిం చారు. ఫలితం లేకపోయింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత దేముడు పోడు వ్యవసాయం చేస్తున్న 2.30 ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టా ఇచ్చారు. భూమికి పట్టా ఇవ్వడం ఎంతో సంతోషం కల్గించిందని, జగనన్నతో పాటు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు రుణపడి ఉంటామని దేముడు చెబుతున్నాడు.

- గిరి బతుకుల్లో వెలుగులు నింపిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు
- తండ్రి హయాంలో సర్వే... తనయుడి ఆధ్వర్యంలో పట్టాల పంపిణీ
- అనకాపల్లి, పాడేరు జిల్లాల్లో 20 షెడ్యూల్, నాన్ షెడ్యూల్ మండలాల రైతులకు లబ్ధి
- 1,12,873 మందికి 1,89,103.08 ఎకరాలకు పట్టాల అందజేత

వారంతా అడవి బిడ్డలు. అక్కడే పుట్టి అక్కడే పెరిగిన వారు. ఆ భూమిలోనే పంటలు పండించుకుని జీవనాధారం పొందుతున్నారు. అయితే వారి పాలిట అటవీ చట్టాలు శాపాలుగా మారాయి. రెక్కలు ముక్కలు చేసుకుని, చెమటోడ్చి చదును చేసిన భూమిని వదిలి వెళ్లలేక.. మరో బతుకులేక.. అధికారుల వేధిం పులు తాళలేక నానా అవస్థలు పడ్డారు.

పరిస్థితి మారింది. ప్రజల బాధను అర్థం చేసుకునే నాయకుడు అధికార పగ్గాలు చేపట్టారు. ఆ భూములపై వారికి హక్కు కల్పించాలని భావిం చారు. వెంటనే అర్హులందరికీ ఆర్వోఎఫ్ ఆర్ పట్టాలు అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారి బతుకులకు ధీమా కల్పించారు.

చీడికాడ: వారు గిరిపుత్రులు. పూర్వీకుల నుంచి అడవిపై ఆధారపడి జీవించే కష్టజీవులు. అడవినే సాగుభూమిగా మార్చి పోడు వ్యవసాయం ద్వారా వచ్చే పంటలతో జీవనోపాధి సాగిస్తున్నారు. అయితే అటవీ చట్టాలు వారి జీవనోపాధికి ఆటంకంగా మారాయి. అమాయకులైన గిరిపుత్రులను ఇబ్బం దులకు గురిచేశాయి. కేంద్ర ప్రభుత్వం 2006లో అట వీహక్కుల చట్టం తీసుకొచ్చింది. అదే సమయంలో ఉమ్మడి ఏపీకి సీఎంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. అటవీ భూముల్లో పోడు వ్యవసాయం చేస్తున్న వారి వివరాలతో కూడిన సర్వేకు ఆయన హయాంలో శ్రీకారం చుట్టారు. ఈ సర్వే పూర్తి అయి పట్టాలు అందించే నాటికి వైఎస్ మృ తి చెందారు. ఆ తరువాత వచ్చిన కిరణ్‌కుమార్ రెడ్డి, టీడీపీ ప్రభుత్వం హయాంలో పంపిణీ దాదాపుగా మరుగున పడింది. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత అర్హులైన వారందరికీ పట్టాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా అర్హుల వివరాలను సమగ్రంగా సేకరించి అమలు పరి చేందుకు ఆర్‌వోఎఫ్ఆర్ ప్రత్యేక సెల్‌ను ఆయా ఐటీడీ ఏల పరిధిలో ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని పాడేరులో ఈ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సెల్ పరిధిలో అనకాపల్లి, పాడేరు జిల్లాల్లో పాడేరు, నర్సీపట్నం, అనకాపల్లి రెవెన్యూ డివిజన్లలో 20 మండలాలున్నాయి. వీటిలో షెడ్యూల్-11, నాన్ షెడ్యూల్-9 మండలాలుగా విభజించారు. 20 మండ లాల్లో 10 ఫేజ్‌ల్లో 1,12,873 మంది రైతులకు 1,89,103.08 ఎకరాలకు పట్టాలు అందించారు.

పాడేరు డివిజన్ పరిధిలో 11 మండలాల్లో 1,09,337 మంది రైతులకు 1,82,516.75 ఎకరా లకు సంబంధించి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందజే శారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో ఆరు నాన్‌షె డ్యూల్ మండలాల్లో 2,122 మంది రైతులకు 3,970.08 ఎకరాలకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో మూడు నాన్ షెడ్యూల్ మండలాల్లో 1,414 మంది రైతులకు 2,616.25 ఎకరాలకు పట్టాలు ఇచ్చారు.



గుంటి వద్ద కొండ అంచుల్లో గిరిపుత్రులు సాగుచేస్తున్న జీడిమామిడి తోటలు

అనకాపల్లి డివిజన్ పరిధిలో

మండలం	లబ్ధిదారులు	ఎకరాలు
వి.మాడుగుల	657	1,019
చీడికాడ	349	518.76
దేవరాపల్లి	408	1,020.64



తమకు అందించిన పట్టాలు చూపుతున్న రెల్లలపాలెం గిరివాసులు (ఫైల్)

పాడేరు డివిజన్ పరిధిలో

మండలం	లబ్ధిదారులు	ఎకరాలు
అరుకువేలీ	8,851	11,436.87
డుంబ్రిగుడ	10,010	9,582.36
ముంచంగిపుట్టు	7,418	9,070.13
పెదబయలు	10,362	12,662.17
హుకుంపేట	12,730	14460.65
పాడేరు	8,031	13,967.93
జి.మాడుగుల	10,062	21,765.92
జి.కె.వీధి	12,821	28,969.75
చింతపల్లి	10,716	19,830.33
కొయ్యూరు	9,502	22,505.52
అనంతగిరి	8,834	18,265.12

నర్సీపట్నం డివిజన్ పరిధిలో

మండలం	లబ్ధిదారులు	ఎకరాలు
నర్సీపట్నం	11	30.88
రోలుగుంట	196	331.67
రావికమతం	383	112.67
గొలుగొండ	458	1,095.84
కోటవురట్ల	268	549.41
నాతవరం	806	1,311.47



ఈ ఫొటోలో మహిళ పేరు కోసూరి కొం డమ్మ. దేవరాపల్లి మండలం వాలాబు గ్రామం ఈమెది. పూర్వం నుంచి ఈమె కుటుంబం సుమారు ఐదు ఎకరాల అటవీ భూమిని సాగుచేస్తోంది. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అటవీ హక్కుల చట్టం ప్రకారం సర్వే జరిపారు. ఆయన ఆకస్మిక మరణం తర్వాత, మైదాన ప్రాంత గిరిజనుల పేరిట వీరికి పట్టాలు తిరస్కరించా రు. జగన్ సీఎంగా అధికారం చేపట్టాక వీరి సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనా యుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొండ మ్మ పేరిట 4.19 ఎకరాలకు పట్టా అందిం చారు. దీంతో అధికారుల ఇబ్బందులు తొలగినట్లు కొండమ్మ ఆనందంగా చెబుతోంది.

ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల అందజేతకు ప్రత్యేక సెల్

ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల అందజేతకు ప్రభుత్వం ప్రత్యేక సెల్‌ను పాడేరు ఐటీడీఏలో ఏర్పాటు చేసింది. ఆర్‌వోఎఫ్ఆర్ సెల్ పరిధిలోకి వచ్చిన ప్రతి అర్హుడికి మంజూరైన పట్టాను నేరుగా ఆయా మండలాల తహసీల్దార్లకు అందించాం. పట్టా పొందిన ప్రతి రైతు, భూమి వివరాలను గిరిభూమి వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేస్తాం. ఇప్పటి వరకు 10 విడతలుగా పట్టాలు అందిం చాం. ఇంకా ఎవరైనా మిగిలిపోయినా వారికి అందిస్తాం. ఇది నిరంతరం ప్రక్రియ.

– జి.ఈశ్వరరావు, ఆర్‌వోఎఫ్ఆర్ సెల్ జిల్లా ప్రాజెక్టు మానెటరింగ్ ఆఫీసర్, ఐటీడీఏ, పాడేరు

జనవరి నాటికి 11,164 టిడ్కో ఇళ్లు సిద్ధం

- అధికారులను ఆదేశించిన టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టిడ్కో ఛైర్మన్ ప్రసన్నకుమార్

సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి 1.50 లక్షల ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉందని టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో 11,164 టిడ్కో గృహాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి టిడ్కో సర్కిల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్స్ ఆఫ్ బ్యాంక్ లింకేజ్ ప్రతినిధులతో టిడ్కో గృహాల నిర్మా ణాలపై అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఛైర్మన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణీతకాల వ్యవధిలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలావరకు టిడ్కో గృ హాలు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని కూడా యుద్ధప్రాతిపదికన ఈ నెలాఖరు లేదా రాబోయే జనవరి నెలాఖరు నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. విశాఖ, అనకా పల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో నిర్మా ణాలు పూర్తిచేసుకోనున్న 11,164 టిడ్కో ఇళ్లను సకల సదుపాయాలతో లబ్ధిదారులకు అందించేం దుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. త్వరలో జీవీఎంసీ పరిధిలో 4,082, అనకాపల్లి జిల్లాలో 2,744, విజయనగరం జిల్లా సారిపల్లిలోని 352, సోనియానగర్‌లో 1,088, సాలూరులో 1,248, శ్రీకాకుళం జిల్లా పలాసలోని 912, ఇచ్ఛాపురంలో 192, ఆమదాలవలసలో 548 ఇళ్లకు సంబంధించిన ఇళ్లకు సంబంధించిన ముం దస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ప్రసన్నకుమార్ సూచించారు. ఈ సమీక్షలో క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ ఎం.వెంకటేశ్వరరావు, టిడ్కో ఎస్ఈలు నరసింహమూర్తి, రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికా రులు మూడు జిల్లాల సీఎల్‌టీసీ సభ్యులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.8 కోట్లతో ఆరు రోడ్ల అభివృద్ధి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం: నియోజక వర్గంలో వివిధ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.8 కోట్లు మం జూరు చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ నాలుగు మండలాల్లో వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ పూర్తిగా శిథిలావ స్థకు చేరుకున్న ఆరు రోడ్లను కొత్తగా వేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఐతంపూడిరోడ్డు, గుడివా డ-మట్టవానిపాలెం రోడ్డు, మత్రివ లస-గొల్లలపాలెం రోడ్డు, గొన్నవాని పాలెం రోడ్డు, రావికమతం-నాగన్న పాలెం వరకూ బీటీ రోడ్లు మంజూరైనట్లు పేర్కొ న్నారు. ఈ ఐదు రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రావికమతం నుం చి తోటకూరపాలెం వరకూ వయా తట్టబంద, గుడ్డిప, గొంప మీదుగా ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ రోడ్లకు వారంలో టెండర్లు పిలిచి, పనులు వేగవంతంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్లుకు సీఎం జగన్ చొరవతో మోక్షం కలిగిందన్నారు. నియోజకవర్గం ప్రజల తరపున సీఎంకు కృతజ్ఞ తలు తెలిపారు.

ఎర్నాకులం-హతియా మధ్య స్పెషల్ రైళ్లు

- సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి



తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం-హతియా-ఎర్నాకుళం మధ్య అన్ రిజ ర్వుడ్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె. త్రిపాఠి తెలిపారు. ఎర్నాకుళం-హతియా(06131) స్పెషల్ ఈ నెల 22, 29, జనవరి 5వ తేదీల్లో ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయలుదేరి మూడవ రోజు మధ్య రాత్రి 12.12 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.17 గం టలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 4.45 గంటలకు హతియా వెళ్తుంది. తిరుగుప్ర యాణంలో హతియా-ఎర్నాకుళం(06132) స్పెషల్ ఈ నెల 26, జనవరి 2, 9 తేదీల్లో హతియాలో ఉదయం 11.30 గంటలకు బయ లుదేరి రెండవరోజు తెల్లవారు 3.58 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి నాలుగు గంటలకు బయలుదేరి మూడవ రోజు ఉదయం 6.30 గంటలకు ఎర్నాకుళం వెళ్తుంది. ఈ స్పెషల్ రైళ్లు 21-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ సీటింగ్ కం లగేజీ కోచ్‌లతో నడుస్తాయి.

ముక్కోటి దేవతలు ఒక్కటయ్యేవేళ

- వైష్ణవ ఆలయాల్లో నేడు ఉత్తర ద్వార దర్శనం
- ఉపమాకలో విస్తృత ఏర్పాట్లు



దేదీప్యమానంగా ఉపమాక ఆలయం



పుష్పాలంకరణలో స్వామి

నక్కపల్లి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించేందుకు జిల్లాలో ఉపమాకతోపాటు చోడవరం శ్రీ కేశవస్వామి దేవాలయం, వడ్డాది వేంకటేశ్వరస్వామి, గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో సహా మిగతా వైష్ణవా లయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. మూడు కోట్ల దేవ తలకు రాక్షసుల బాధల నుంచి విముక్తి కల్పించిన రోజు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అం టారు. 24 ఏకాదశుల్లో సౌరమానంలో ప్రాశస్త్యమైన ధనుర్మాసంలో వచ్చే ఏకాదశిని వైకుంఠ ఏకాదశిగా కూడా పిలుస్తారు. తిరుపతి, సింహాచలం, అన్నవరం భద్రాచలం తదితర వైష్ణవ క్షేత్రాల్లో ముక్కోటి ఏకాద శినాడే ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తే ఉపమాకలో నిత్యం ఉత్తర ద్వార దర్శనం ఉంటుంది.

రంగనాథుని అలంకరణలో ...

ముక్కోటి ఏకాదశినాడు సాయంత్రం స్వామివారిని రంగనాథుడిగా అలంకరిస్తారు. శ్రీదేవి, భూదేవి కాళ్లువత్తుతున్నట్టుగాఅలంకరించి పుణ్యకోటి వాహ నంపై వేంచేయింపజేస్తారు.

8 వాహనాల్లో తిరువీధి సేవలు

ఎక్కడా లేని విధంగా ముక్కోటి ఏకాదశినాడు ఉపమాక పుణ్యక్షేత్రంలో ఎనిమిది వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తారు. రాజాధిరాజవా హనంలో గోదాదేవి అమ్మవారిని, పొన్న వాహనం లో రుక్మిణి సహిత వేణుగోపాలస్వామిని, ఆంజ నేయ వాహనంపై సీతారాములను పల్లకిపై బాల రాముడిని, వీరితోపాటు ఇతర వాహనాలపై తాం డవ కృష్ణుడు,ప్రాకార పెరుమాళ్లను ఉంచి తిరువీధి సేవలు నిర్వహిస్తారు.

ఘనంగా ఏర్పాట్లు చేసిన టీటీడీ

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తిరు మల తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని, గోపురాలను సర్వాంగ సుందరంగా పూలమాలలతో అలంకరిం చారు. బేడామండపం, మహాద్వారం, ధ్వజస్తం భాల వద్ద పూలతో అలంకరణ చేశారు. వైకుంఠ ఏకాదశి నాడు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కూడా స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివ స్తారని ఆలయప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

నేడు వడ్డాదిలో గిరి ప్రదక్షిణ



శ్రీదేవి, భూదేవిలతో వేంకటేశ్వరస్వామి

బుచ్చెయ్యపేట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శని వారం వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామి దర్శనం కల్పించడంతో పాటు గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు చేసి నట్టు దేవస్థానం ఈవో శర్మ, గ్రామ పెద్దలు తెలి పారు. భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు కల్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగేలా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

గిరి ప్రదక్షిణ ఇలా...

బీఎన్ రోడ్డును ఆనుకుని ఉన్న వేంకటేశ్వరస్వామి ఆర్చ్ వద్ద ఉదయం గిరి ప్రదక్షిణ ప్రారంభమై మార్కెట్ యార్డు స్థలం రోడ్డు నుంచి కాలేజీ మీదగా హై స్కూల్ ముందు నుంచి జరుగుతుం ది. వేంకటేశ్వర స్వామి వారి చిత్ర పటాలు, గోవింద నామస్మరణ, ప్రత్యేక భజనలతో గిరి ప్రదక్షిణ చేయడానికి ఏర్పాట్లు చేశారు.

రైతు బృందాలకు ప్రకృతి సాగుపై శిక్షణ



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న లచ్చన్న

తుమ్మపాల: గ్రామ స్థాయిలో 5 నుంచి 15 మంది రైతులు చిన్నచిన్న గ్రూపులుగా ఏర్పడితే ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాలు అం దజేస్తామని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు అధికారి జి.లచ్చన్న తెలిపారు. పట్టణంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరి గిన రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ శాఖ, రైతు సాధి కార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం సహకారం తో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్వయంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్ప త్తులను వినియోగించేందుకు అందరూ ఆసక్తి చూపి స్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనర్ వి.అ నుషా, వర్మ, 24 మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా అడ్డుకట్టకు ప్రత్యేక నిఘా

- డీఎస్పీ సుబ్బరాజు



దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు

దేవరాపల్లి/కె.కోటపాడు: గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంచినట్టు అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా దేవరాపల్లి, కె.కోటపాడు పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా స్టేషన్లలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి కేసులకు సం బంధించి ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో పరారీలో ఉన్న వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. సార్వత్రిక ఎన్ని కలు సమీపిస్తున్న దృష్ట్యా సమస్యాత్మక గ్రామాల్లో ఘర్షణలకు దిగే వ్యక్తులను ముందుగా గుర్తించి, బైండోవర్ చేయాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు మాడుగుల మండలం తాటిపర్తి, చీడికాడ మండలం కోనాంలవద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, నేరుగా తమకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించేందుకు మొబైల్ చెకింగ్ టీమ్ సైతం నిరంతరం పనిచేస్తుందన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న వ్యక్తులను, నాన్ బెయిల వారెంట్ జారీ అయిన వ్యక్తులను పట్టుకు నేందుకు జిల్లాలో ప్రత్యేక టీమ్‌లు పని చేస్తు న్నాయని, ఎస్పీ నేతృత్వంలో ఈ టీమ్‌లు మానట రింగ్ జరుగుతోందని చెప్పారు. స్టేషన్ల ఆవరణ లను సుందరంగా తీర్చిదిద్దడంపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఐ కె.కుమార స్వామి, ఎస్ఐలు డి. నాగేంద్ర, ఆర్.ధ నుంజయ్ ఉన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు



యలమంచిలి రూరల్:పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిరమాసోత్సవాల్లో భాగంగా రెండో శుక్రవారం అమ్మవారి సారె ఊరేగింపు సంప్రదాయబద్ధంగా జరిగింది.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఇష్టమైన పిండివంటలు, పండ్లను బాజా భజంత్రీలు, సన్నాయి వాయిద్యాల నడుమ అధ్యాత్మికత ఉట్టిపడేలా ఊరేగింపు జరిపారు. ధర్మవరం రామాలయం నుంచి ప్రారంభమైన సారె ఊరేగింపు క్లబ్ రోడ్డు, ప్రధాన రహదారి,కాకివానివీధుల గుండా కొన సాగింది.సారె ఊరేగింపులో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు.పల్లకీ సేవలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సారె ఊరేగింపు అనంతరం మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అదనపు ఎస్‌ఐ జె. నాగేశ్వరరావు తెలిపారు. నరసింగబిల్లి నుంచి చింతలపాలెంలో జరిగిన వివాహానికి వెళ్లి తిరిగి తన గ్రామానికి నడిచి వస్తున్న జెట్టపు రెడ్డి తునికి చెందిన ఎర్ర కాశీరత్నం(65)ను ఈ నెల 20న గొబ్బూరు నుంచి నరసింగబిల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కాశీరత్నంను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పట్టుబట్టి.. కొలువుకొట్టి..

వారిద్దరిదీ ఒకే గ్రామం.. ఒకే కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఒకేసారి ఎస్సై కొలువు సాధించారు. ఇప్పుడా గ్రామంలో సంబరాలు నెలకొన్నాయి. వారిలో ఒకరు నిరుపేద రైతు కుమారుడైతే.. మరొకరు తన చిన్నతనంలో తండ్రిని కోల్పోయాడు. అయినప్పటికీ పేదరికాన్ని పంటి బిగువన భరించి కష్టాలను శ్రమ అనే నిచ్చెనగా చేసుకుని పట్టుదలతో చదివారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన తుది ఎస్సై మెయిన్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు.

- ఎస్సై పరీక్ష ఫలితాల్లో ఇద్దరు యువకుల ఎంపిక
- పొన్నవోలులో సంబరాలు



ఎస్సైగా ఎంపికైన దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ సతీష్, అధ్యాపకులు



పులఖండం నాని

రావికమతం/నర్సీపట్నం: సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఇద్దరు యువకులు పట్టుదలతో చదివి ఎస్సై కొలువు పట్టారు. రావికమతం మండలం పొన్నవోలు గ్రామానికి చెందిన యువకులు పులిఖండం నాని, కొరసాల దుర్గాప్రసాద్ ఎస్సైలుగా ఎంపిక కావడంతో గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది. వీరు నిరుపేద కుటుంబంలో పుట్టారు. నాని తండ్రి నిరుపేద రైతు.. తన ఇద్దరు కొడుకులను కష్టపడి చదివించాడు. వీరిలో రెండో కుమారుడు నాని ఎస్సై పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. దుర్గాప్రసాద్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా, తన అన్నయ్య అంజి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివాడు. అతడి ప్రోద్బలంతో దుర్గాప్రసాద్ కష్టపడి ఎస్సై పరీక్షల్లో ప్రతిభ చూపాడు. ఇద్దరు యువకులు తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఒకేసారి ఓపెన్ కేటగిరీలో ర్యాంక్‌లు సాధించి ఎంపిక కావడంపై మండల నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గాప్రసాద్‌కు నాలుగు కొలువులు వచ్చినా..

కె.దుర్గాప్రసాద్, నాని ఎస్సైలు ఎంపిక కావడంతో రిషీ కళాశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. ఇతడికి ప్రభుత్వ కొలువులు నాలుగు వచ్చినప్పటికీ ఎస్సైగా రాణించాలనే సంకల్పంతో వాటిలో చేరలేదు. నాని ప్రస్తుతం తెలంగాణలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అతడు అందుబాటులో లేకపోవడంతో నర్సీపట్నంలో దుర్గాప్రసాద్‌ను కరస్పాండెంట్ కోనా సతీష్, డైరెక్టర్ ఆర్.వై.నాయుడు, ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎ.భాస్కర్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ మురళీకృష్ణ సత్కరించారు. కష్టపడి చదివితే విజయం వరిస్తుందని, దానికి అనుగుణంగా సాధన చేయాలని తోటి విద్యార్థులకు దుర్గాప్రసాద్ సూచించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: విద్యార్థి దశలో వినియోగదారుల చట్టంపై అవగాహన ఏర్పరచుకుంటే భవిష్యత్‌లో దాని ద్వారా కలిగే ప్రయోజనాలను పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సత్తి అరుణశ్రీ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అరుణశ్రీ పాల్గొన్నారు. ఇటీవల ఒక మహిళ ఫ్యాషన్ హెయిర్ సెలూన్‌లో ఫేస్ వాస్ చేయించుకోగా, తన ముఖం అందవిహీనంగా తయారు కావడంతో వినియోగదారుల కోర్టును ఆశ్రయించి రెండు కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని పొందిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు. సభాధ్యక్షుడు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారుడు తనకు కలిగిన నష్టానికి వినియోగదారుల కోర్టును ఆశ్రయించి పరిహారం పొందే వీలుందన్నారు. 1986లో చేసిన చట్టానికి 2019 నాటి వినియోగదారుల హక్కుల చట్టానికి వ్యత్యాసాలను కామర్స్ హెడ్ వి.అప్పలనాయుడు వివరించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా చట్టంలో మార్పులు చేపడితే వినియోగదారులకు మరింత మేలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. సీనియర్ ఉపన్యాసకులు ఎస్.ఎం.రఫీయుద్దీన్, సుధీర్, డి.పిచ్చమ్మ, రత్నభారతి, లక్ష్మీమంగమ్మ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో గీతామాధురి ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు

రోలుగుంట: వినియోగదారుల ఫోరం జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో రోలుగుంట మండలం కుసుర్లపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి టి.గీతామాధురి పాల్గొని, ప్రతిభ కనబరిచింది. జిల్లాలోనే ప్రథమ స్థానం దక్కించుకుందని పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది, విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్కడ కూడా తమ విద్యార్థి విజయాన్ని సాధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయులతో కలసి గీతామాధురిని అభినందించారు. కార్యక్రమంలో అప్పన రాంబాబు, సాంబశివరావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎగ్జిబిషన్



కంపాస్ పరికరాలతో విద్యార్థులు తయారు చేసిన నమూనా



విజేతలకు బహుమతి ప్రదానం

చోడవరం రూరల్: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మ్యాథ్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. దీనిని ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ప్రారంభించారు. గణితశాస్త్ర ఉపాధ్యాయులు డి.వి.వి.రమణి, కె.సంజీవరావుల పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన పలు మ్యాథ్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థి రామకృష్ణ కంపాస్ బాక్స్ పరికరాలతో రూపొందించిన సైకిల్‌ను అందరూ ఆసక్తిగా తిలకించారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. విద్యార్థులు డ్యాన్సులు, పలు స్కిట్లతో అలరించారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.

ఉపాధ్యాయులు రవిశంకర్, దొర, విశ్వనాథ్, శంకర్, కృపామణి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీకి గోల్డెన్ పీకాక్ అవార్డు



గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న సింహాద్రి సీఎస్సార్ ప్రతినిధులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి గోల్డెన్ పీకాక్ అవార్డు లభించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) ద్వారా విశేష కృషి చేసినందుకు గాను ఎన్టీపీసీ సింహాద్రి ప్రతినిధులకు ముంబయిలోని తాజ్ ల్యాండ్స్ ఎండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బహూకరించారు. ఎన్టీపీసీ హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, సీఎస్సార్ ఎగ్జిక్యూటివ్ శివం ప్రతాప్‌సింగ్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తమ సంస్థకు ప్రతిష్టాత్మకమైన అవార్డు దక్కినందుకు యాజమాన్య ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్సార్ ద్వారా సమాజాభివృద్ధికి అవసరమైన మరిన్ని కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకాశరావు, శివం ప్రతాప్‌సింగ్ పేర్కొన్నారు. ముంబయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ తదితర ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏడు తులాల బంగారు నగల చోరీ



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ రవికుమార్



దొంగతనం గురించి విచారిస్తున్న అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో జరిగిన దొంగతనంలో ఏడు తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ రూ.4 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం గ్రామానికి చెందిన కొల్లి సత్యవతి అనారోగ్యానికి గురైన తన తల్లిని చూసేందుకు ఈ నెల 16న శెట్టిపాలెం వెళ్లారు. తన అల్లుడు కొండబాబు ముందుగా తాళ్లపాలెంలోని ఇంటికి శుక్రవారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి తలుపులు కొంచెం తెరచి ఉండటం గమనించారు. దీంతో విషయాన్ని అత్త సత్యవతికి తెలిపి, ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా తెరచి ఉంది. అందులో ఉన్న సుమారు ఏడు తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనకాపల్లి సీఐ ఎ.రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. క్లూస్ బృందం వచ్చి వేలి ముద్రలు సేకరించారు. బాధితురాలు సత్యవతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫోల్డర్స్, సంచులపై ముద్రణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా ఫోల్డర్స్, సంచులపై ముద్రణ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఏఎన్ఏకెఏపీఏఎల్ఎల్ఐ.ఏపీ.జీవోవి.ఐఎన్.వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ లోపు జిల్లా కార్యాలయ పనిదినాల్లో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఎన్‌హెచ్ఎం, డీపీఎం, డీఎంహెచ్‌వో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వరి పంట నష్టపరిహారం అందించేందుకు చర్యలు



వరి దిగుబడిని పరిశీలిస్తున్న శశికళ

అనకాపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా డివిజన్ పరిధిలో వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టిందని డివిజన్ ఉప గణాంక అధికారి ఎం.శశికళ తెలిపారు. జిల్లా గణాంకాల అధికారి జి.రామారావు ఆదేశాల మేరకు స్థానిక జాతీయ రహదారిలోని ఆవఖండం భూముల్లో పంట నష్టాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. పంట దిగుబడి అతి తక్కువగా రావడంతో 5x5మి.మీ. పొలంలో లెక్కను చూసి తద్వారా పంట నష్టపరిహారం లెక్కించారు. సాధారణంగా జిల్లా అంతా సక్రమంగా వరి దిగుబడి వచ్చినట్లయితే 12 నుంచి 15 కేజీలు ఎకరాకు వస్తుందని ఆమె పేర్కొన్నారు. వరి రైతుల ద్వారా తీసుకున్న గణాంకాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ సహాయ గణాంకాల అధికారి ఈ.కె.శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మహేష్ మృతదేహం

అనకాపల్లి: బ్రాండిక్స్ బస్సు ఢీకొని బొడ్డే మహేష్(56) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ కథనం మేరకు వివరాలు... స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రామాలయం సమీపంలో మహేష్ తన గేదెలకు కుడితి తీసుకు వెళ్లేందుకు రిక్షాతో వస్తున్న సమయంలో అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వెళుతున్న బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కోడలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా గణిత మేధావి రామానుజన్ జయంతి



మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

రోలుగుంట: ప్రతి విద్యార్థిగణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. బీబీ పట్నం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం హెచ్‌ఎం ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రామానుజన్ జయంతి వేడుకల్లో పాల్గొని, మాట్లాడారు. ముందుగా పిల్లలను గణిత ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టి, ఉత్సాహపరిచారు. నిత్య జీవితంలో గణితం వినియోగం, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, రత్నంపేట మాజీ సర్పంచ్ తమటపు సత్యం నాయుడు, కర్రి రాంప్రసాద్, కురచ లక్ష్మీనారాయణ, పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ



కొత్త ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల వారు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పూర్తి వైద్యం పొందేందుకు ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంచినట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని తగరంపూడి సచివాలయంలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల వరకూ ఉండేదని, వ్యాధులను బట్టి రోగికి వైద్యం ఖర్చులు పెరగడంతో పేదవారికి పూర్తిగా వైద్యం అందించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరసింహారావు, తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి పావని, గ్రామ కార్యదర్శి వెంకటేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన



ఈవీఎం ఓటింగ్‌లో మార్టూరు గ్రామ ఓటర్ రాజారావు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డివిజన్ పరిధిలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు తెలిపారు. మండలంలోని మార్టూరు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈవీఎంలపై బీఎల్వోల సాయంతో శుక్రవారం డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈవీఎంలపై ఓటేసేటపుడు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఓటర్ ఏ గుర్తుకు ఓటు వేస్తున్నారో స్వయంగా ఓటరే చూసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

'నాడు-నేడు' అభివృద్ధి పనుల పరిశీలన



పౌష్టికాహార కిట్లను అందిస్తున్న దాడి రత్నాకర్

కశింకోట: మండలంలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ శుక్రవారం పర్యటించారు. జిల్లా పరిషత్ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి నాడు-నేడులో చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సొంత ఖర్చుతో స్కూల్ ముందు ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నా రు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. తన సొంత నిధులతో ఆరోగ్య కేంద్రానికి రెండు సెలైన్ స్టాండ్లు, ఫ్యాన్, లైట్లు ఏర్పాటు చేయించనున్నట్లు హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. సర్పంచ్ కన్నం శ్యాంసన్, కోన నాయుడు, స్థానిక నాయకులు ఊడి చినబాబు, బుదిరెడ్డి రామారావు, తిర్రి రామారావు, సీహెచ్ మురళి, మల్లపురెడ్డి చిరంజీవి, బద్ది చెల్లయ్య, లోవ అప్పారావు, మాజీ సర్పంచ్ మల్లపురెడ్డి అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి దొరబాబు, దాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎర్రబ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పేరిట స్థానిక డిపో గేటు వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు మాట్లాడుతూ చిన్నచిన్న కేసుల్లో ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని, శాఖ ఎండీ ఇచ్చిన సర్క్యులర్‌ను అన్ని డిపోల్లో అమలు చేయాలని నినాదాలు చేశారు. డిపో ఆర్గనైజింగ్ కార్యదర్శి పీవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

ఆక్వామెన్(తెలుగు): రాజా	
సలార్	: సత్యనారాయణస్క్రీన్-1
ఆక్వామెన్(తెలుగు-3డీ)	: సత్యనారాయణస్క్రీన్-2
హాయ్ నాన్న	: షిర్డిసాయి
సలార్	: పర్తిసాయి
మంగళవారం	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
సలార్	: రామచంద్ర



రాష్ట్రంలో మహిళలు వంటింటికే పరిమితం కారాదు. కుటుంబ సంపాదనలో వారూ కీలక పాత్ర పోషించాలి. చిరు వ్యాపారాలతో ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి. అందుకే సీఎం జగన్ వైఎస్సార్ చేయూత పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేల లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే మూడు విడతల లబ్ధి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.



నా పేరు లక్ష్మి. మాది అక్కిరెడ్డిపాలెం. నాకు ఇద్దరు పిల్లలు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం మాది. నేను, నా భర్త ఇద్దరం పనిచేస్తేగాని కుటుంబం గడవడం కష్టం.ఎప్పటి నుంచో పాడి గేదెను కొనుక్కోవాలని పైసా పైసా కూడబెట్టుకుంటూ వస్తున్నాం. జగన్‌బాబు అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ చేయూత పథకంలో నన్ను ఎంపిక చేశారు. ఈ పథకంలో మూడేళ్లు ఇచ్చిన నగదు దాచుకుని, దానికి మా కష్టార్జితం కలిపి గేదెను అనుకున్నదానికంటే తక్కువ కాలంలోనే కొనుక్కున్నాం. ఆ గేదె ఇచ్చే పాలలో లీటర్ ఇంటి అవసరాలకు పోగా, మిగిలిన పాలను పాల కేంద్రానికి అందిస్తున్నాం. దీని ద్వారా వచ్చే ఆదాయం మా కుటుంబానికి చేయూతనిస్తోంది. నాలుగో విడత జనవరిలో వేస్తారని వలంటీర్లు చెప్పారు. ఈ పండగ మాకు మరింత ఆనందాన్నివ్వనుంది.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక చేయూత



పట్టణంలోని నెయ్యిలవీధిలో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న చేయూత లబ్ధిదారు ఎల్లమ్మ

- అనకాపల్లి జోన్‌లో వైఎస్సార్ చేయూత లబ్ధి రూ.22.45 కోట్లు
- చేయూత పథకంతో చిరు వ్యాపారాల్లో మహిళల రాణింపు
- నాలుగో విడత నిధుల పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు

అనకాపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినపుడే ఆ కుటుంబానికి, తద్వారా రాష్ట్ర పురోభివృద్ధికి దోహదపడతారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారు. అందులో భాగంగానే వైఎస్సార్ చేయూత పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకంలో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు నాలుగేళ్లలో రూ.75 వేలు చొప్పున ఆర్థిక లబ్ధి చేకూరుతోంది. ఇప్పటికే మూడు విడతల్లో రూ.18,750 చొప్పున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. చివరి/నాలుగో విడత నిధులను వచ్చే నెలలో జమ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎంఎన్‌సీలతో శిక్షణ

చేయూత పథకంలో ప్రభుత్వం అర్హులకు కిరాణా షాపులు, గేదెలు, ఆవులు, మేకలు/గొర్రెల యూనిట్ల ఏర్పాటుకు సహకరిస్తోంది. దీని కోసం అమూల్, రిలయన్స్, పీ అండ్ జీ, ఐటీసీ వంటి బహుళ జాతి సంస్థ(ఎంఎన్‌సీ)లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా సంస్థల ప్రతినిధులు పలుమార్లు చేయూత లబ్ధిదారులకు వ్యాపార నిర్వహణలో శిక్షణ కూడా ఇచ్చారు.

అనకాపల్లి జోన్ పరిధిలో చేయూత లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు లబ్ధి
2020-21	3,847	రూ.7.21 కోట్లు
2021-22	4,273	రూ.7.59 కోట్లు
2022-23	4,086	రూ.7.65 కోట్లు

అర్హతలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన మహిళలు అర్హులు.
- ఆధార్‌కార్డుతోపాటు తెల్ల రేషన్‌కార్డు/రైస్ కార్డు తప్పనిసరి.
- కుటుంబ ఆదాయం నెలకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలకు మించరాదు.
- మొత్తం కుటుంబానికి మూడెకరాల మాగాణి లేదా 10 ఎకరాల మెట్ట రెండు కలిపి 10 ఎకరాలు దాటరాదు. పట్టణ ప్రాంతంలో 750 చదరపు గజాలకు మించి ఇంటి స్థలం ఉంటే అనర్హులు.
- కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం/ప్రభుత్వం నుంచి ఉద్యోగ విరమణ పెన్షన్ ఉండరాదు.

చేయూతతో భరోసా కలిగింది



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాకో భరోసా కలిగింది. రూ.18,750లు చొప్పున ఇప్పటి వరకు మూడేళ్ల చేయూత పథకం ద్వారా నా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డాయి. ఈ మొత్తంతో ఇంటి వద్దే బిస్కెట్లు తయారు చేస్తున్నా. నా భర్త నాగుమల్లి జగన్ పట్టణంలోని పలు దుకాణాలకు ఈ బిస్కెట్లు వేస్తుంటారు. దీని ద్వారా వచ్చిన ఆదాయంతో మా ఇద్దరు పిల్లల్ని ఏ ఇబ్బందీ లేకుండా పోషించుకుంటున్నాం.

– నాగుమల్లి నూకరత్నం, ఉడ్‌పేట

టీ దుకాణంతో ఉపాధి



మాలాంటి పేదల బతుకుల్లో జగనన్న చేయూత వెలుగులు నింపింది. మూడు సంవత్సరాలు తీసుకున్న చేయూత నగదుతో టీ దుకాణం పెట్టుకున్నా. దీంతో రోజుకి రూ.800 వరకు సంపాదిస్తున్నా. నా భర్త ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. టీ దుకాణంలో వచ్చిన సొమ్ముతోపాటు నా భర్త సంపాదనతో మా కుటుంబం ఆనందంగా గడిచిపోతోంది. మా ఇద్దరు పిల్లల్ని బాగా చదివించుకోగలుగుతున్నాం.

– ఎం.గౌరి, నర్సింగరావుపేట

సీఎం జగన్ పాలనతో భావితరాల అభ్యున్నతి

'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రసన్నలక్ష్మి



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమం, విద్య, వైద్యంతో భావితరాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి కొనియాడారు. స్థానిక సచివాలయం-7 వేల్పులవీధి కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని సచివాలయం కన్వీనర్ ఉగ్గిన అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల్లో ప్రపంచం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడరాదనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నుంచి అవ్వాతాతల పింఛన్ రూ.3 వేలకు పెంచుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వపాఠశాలలను నాడు-నేడు పథకంలో కార్పొరేట్ స్థాయికి తీర్చిద్ది, పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు చేశారన్నారు. అర్హతే కొలమానంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ లబ్ధి రూ.23.38 కోట్ల వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి బ్రోచర్లను అందించారు. రచ్చబండ కార్యక్రమంలో గత, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు బొండా శంకరరావు, గొర్లి చిన్న, మద్దాల రమణబాబు, కొంకి శ్రీరామ్మూర్తి, జెట్టి శ్రీనివాసరావు, బొండా వాసు, ఇంజరపు వెంకటరావు, రామారావు, దాక్షారపు లలితా శ్రీనివాసరావు, ఒడిశెట్టి లక్ష్మి, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగనన్న పౌష్టికాహార కిట్ల పంపిణీ



గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు జగనన్న పౌష్టికాహార కిట్ల అందజేత

కశింకోట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం తెరుచుకున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో ఇబ్బంది లేకుండా సచివాలయ వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఒక్కొక్క కేంద్రానికి ఇద్దరు వంతున గ్రామ వలంటీర్లను కేటాయించి తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి, అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు ఆయా కేంద్రాలకు వెళ్లి బాలింతలు, గర్భిణులకు జగనన్న పౌష్టికాహార కిట్లను అందించడమే కాకుండా పిల్లలకు పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, గ్రామ వలంటీర్లు ద్వారా తయారు చేసిన భోజనాన్ని అందించారు. ఐసీడీఎస్ పరిధిలోని కశింకోట, అనకాపల్లి మండలాల్లో 234 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. శుక్రవారం వాటిని తెరచి 304 మంది బాలింతలు, 298 మంది గర్భిణులకు జగనన్న పౌష్టికాహార కిట్లను అందించారు. 35 కేంద్రాల్లో 109 మంది పిల్లలు హాజరవగా, వారికి అవకాశం ఉన్నచోట్ల మధ్యాహ్న భోజన పథకం ద్వారా వండించి, భోజనం అందించారు. కశింకోటలోని గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కె.శృతి, వెలుగు సీఏ సరళ, గ్రామ వలంటీర్లు లిఖిత, చిన్నమ్ములు సమక్షంలో గర్భిణలు, బాలింతలకు బాల సంజీవని కిట్లను పంపిణీ చేశారు. పిల్లలకు భోజనం వండి పెట్టారు.

ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు



దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం



క్యూలైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి

అనకాపల్లి: స్థానిక దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవ వేడుకలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం దేవాలయం ఆవరణలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం రాత్రి రెండు గంటలకు స్వామివారి సుప్రభాతసేవ, తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వారం ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. దేవాలయం చుట్టూ విద్యుత్ అలంకరణ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాద వితరణ, తాగునీటికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజసులోచన, ఈవోలు ఎం.శ్రీధర్, కీర్తి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సకలా గోవింద్, ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్నసన్యాసిరావు, ముమ్మిని పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మీ శ్రీనివాసరావు, బెల్లాన అనురాధ, ఎక్స్ అఫీషియో సభ్యుడు పులఖండం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవం



కుంచావారి గౌరీపరమేశ్వరులు



నూతన రథాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు

అనకాపల్లి: స్థానిక కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవం శనివారం వేకువజాము నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఉత్సవాన్ని 1811వ సంవత్సరంలో కీ.శే.కుంచా చిన్నయ్య వరహాలమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించారు. అప్పటి నుంచి కుంచావారి కుటుంబ సభ్యులు స్థానిక ప్రజల సహకారంతో ఏటా డిసెంబర్ నెల నాలుగో శనివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు) ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శనివారం ఉదయం 11గంటల నుంచి ఆదివారం, సోమవారం పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగించి, స్థానిక శారదానదిలో నిమజ్జనం చేస్తారు. రింగ్‌రోడ్డు జంక్షన్ నుంచి వేల్పులవీధి జంక్షన్ వరకు భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు నేలవేషాలు, రాత్రికి స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశారు.

- కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి నూతన ఊరేగింపు రథాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాడి వీరభద్రరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న అమ్మవారి మహోత్సవం సందర్భంగా నూతన రథంలో పట్టణ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించనున్నట్లు తెలిపారు. గవరపాలెం కనకదుర్గ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు దంపతుల ఆర్థిక సహకారం రూ.10 లక్షలతో అమ్మవారి నూతన రథాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు గౌరీపరమేశ్వరులను దాడి వీరభద్రరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మ వారి చిత్రపటాన్ని ఆయనకు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు), గౌరవాధ్యక్షుడు పొండ్రంగి సత్యారావు, కోరుకొండ కాశీ, కోటిపల్లి జేజిబాబు, శిలపరశెట్టి బాబీ, కోరుకొండ సాంబశివరావు, పాలూరి శ్రీనివాసరావు, కొమ్మోజి రామకృష్ణ, కుంచా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశుని కల్యాణ మహోత్సవం



కూర్మావతారంలో వేంకటేశ్వరస్వామి



కొబ్బరి ఆకులతో ఆలయం ముందు వేస్తున్న పందిరి

కశింకోట: స్థానిక గవరపేటలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున భారీ ఎత్తున స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్సవంలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 108 సార్లు భక్తుల గుడి ప్రదక్షిణ జరగనున్నాయి. శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను కోలాటాలు, చిటికె భజనలు, తోడ పెద్దు సేవలు, సారెను సన్నాయి మేళాలతో ఊరేగించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహిస్తారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు స్థానికులతోపాటు అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో వస్తారు. ఈ సారి అనకాపల్లికి చెందిన మళ్ల జగదీష్, శైలజ దంపతులు కల్యాణాన్ని జరిపించనున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన, రాత్రి 8.30 గంటలకు శారదానదిలో దోనెలపై శ్రీవారి తెప్పోత్సవం జరగనుంది. అనంతరం ఆలయంలో ఉయ్యాల సేవ, పవళింపు సేవ, పుష్పాంజలి తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకు ఆలయ అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సన్నాహాలు చేసినట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, చైర్మన్ భీశెట్టి కల్యాణ చక్రవర్తి తెలిపారు.

ముక్కోటి ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన కశింకోటలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. గరుడ వాహనంపై శ్రీకృష్ణుడు, గజ వాహనంపై శ్రీరాముని ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించనున్నారు. ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం, విష్ణు సహస్రనామ పారాయణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.

- స్థానిక శివాలయం వద్దనున్న ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు. పూలమాలలు, పండ్లతో అందంగా అలంకరణ చేసినట్లు పేర్కొన్నారు. స్వామిని వజ్ర కవచాలంకృతులను చేసి విష్ణు సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఐసీడీఎస్‌ల నిర్వీర్యానికి బీజేపీ ప్రయత్నం

కశింకోట: కేంద్రంలో బీజేపీప్రభుత్వం ఐసీడీఎస్‌లకు తగిన నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు విమర్శించారు. నియోజక వర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 11 రోజులుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కశింకోటలో నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని శుక్రవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రాష్ట్ర ప్రభుత్వమైనా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకర్, కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.డి.వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగేషు, మండల ప్రతినిధులు తనూజ, రామలక్ష్మి, ధనలక్ష్మి, కుమారి, రమ, లక్ష్మి, కృష్ణవేణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవలో భక్తులు

అనకాపల్లి: గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 187వ ఊంజల్ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. దేవాలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషు, సాయిలు, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, నర్సింగరావు, రామలక్ష్మి, మోహన్, శివశంకర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సేవ నిర్వహించారు. అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై ఇండియా కూటమి నిరసన

తుమ్మపాల: పార్లమెంట్‌లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన విపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఇండియా కూటమి జిల్లా నాయకులు బొడ్డు శ్రీనివాస్, లోకనాథ్, బి.వెంకటరమణ ఆక్షేపించారు. ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా జాతీయ ఇండియా కూటమి పిలుపు మేరకు పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, ప్రశ్నించిన వారిని అణచివేసే విధానాలతో బీజేపీ పాలన సాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న , ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, సీపీఐ నాయకులు వై.భద్రం, రాజాన దొరబాబు, సీపీఎం నాయకులు రుత్తల శంకరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరిబాబు, కాంగ్రెస్ నాయకులు ఐ.ఆర్.గంగాధర్, దాసరి సంతోష్, కాళ్ల వెంకట సత్యనారాయణ, మలపరెడ్డి కోటేశ్వరరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుద్ద కిషోర్, అనకాపల్లి ఎస్సీ సెల్ నాయకులు కట్టుమూరి నూక అప్పారావు, గౌరీపట్నం గుణబాబు పాల్గొన్నారు